విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి కె. కృష్ణవేణి

విశాలాంధ్ర-భీమవరం: ఏపిపిఎస్సి నిర్వహించే డిపార్ట్‌మెంటల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అధికారులకు సూచించారు. మంగళ వారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం డిఆర్వో ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ఎపిపిఎస్‌సి అధికారులు, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ,పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులతో పరీక్షల నిర్వహణపై జిల్లా రెవిన్యూ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ సర్వీస్ డిపార్ట్మెంటల్ పరీక్షలు బుధవారం నుంచి 03, 04 తేదీలలో ఉదయం, సాయంత్రం రెండు పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తా రన్నారు. తాడేపల్లిగూడెం పెదతాడేపల్లిలో శ్రీవాసవి ఇంజనీరింగ్ కళాశాల, తాడేపల్లిగూడెంలో శశి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ , ఇంజినీరింగ్ కాలేజీలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. మొత్తం 851 మంది వివిధ శాఖలు ఉద్యోగ అభ్యర్థులు హాజరవుతారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిపిఎస్సి సహాయ కార్యదర్శి టియస్ రాజ గోపాల్, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లు, పోలీస్, విద్యుత్, హెల్త్ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రిపోర్టర్ రవికి సతీ వియోగం

విశాలాంధ్ర- భీమవరం: భీమవరం సాక్షి టీవీ రిపోర్టర్ గోల్ల రవి సతీమణి విజయలక్ష్మి (47) మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆమె కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడు తున్నారు. ఆమె మృతదేహాన్ని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, సందర్శించి పూలమాల వేసి నివాళు లర్పించారు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి పరామర్శించారు. పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

ప్రజలకు సీఎం సహాయనిధి వరం

విశాలాంధ్ర - నిడమర్రు: పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యం, బువ్వనపల్లి లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ ఆరోగ్య సమస్యలతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు వాసుబాబు ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకొని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సుమారుగా 12 లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నాయకులు కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, వెజ్జు వెంకటేశ్వరరావు, దండు రాము, చనుమూరు శివ, రొంగల శ్రీను, కొండేటి వెంకటరత్నం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరి వైఖరికి నిరసన

విశాలాంధ్ర-తణుకు: వేల్పూరు గ్రామంలో కుల వైషమ్యాలను పెంచి పోషిస్తున్న మంత్రి కారుమూరి వైఖరిని ఖండిస్తూ మంగళవారం వేల్పూరు గ్రామంలో ధర్నా, నిరసన కార్యక్రమం నిర్వహించారు. తణుకు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి, మాజీ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లా డుతూ వేల్పూరు గ్రామంలో మంత్రి కారుమూరి కనుసన్నల్లో బీసీలు పేరుతో చేస్తున్న దీక్షలు ఏవైతే ఉన్నాయో అవన్నీ కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే అని అన్నారు.కులాల మధ్య కుంపట్లు పెట్టే విధంగా వేల్పూరు గ్రామంలో ప్రశాంతమైన వాతావరణానికి భంగం కలిగించే విధంగా కారుమూరి చేస్తున్న ప్రయత్నాలు తప్పితే ఎటువంటి వాస్తవాలు లేవని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వేల్పూరు గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి , ఉప సర్పంచ్ గుణం రాజూరావు, రెడ్డి శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ సంఘటన హేయం

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: మణిపూర్ మారణ హోమం దేశ చరిత్రలోనే అత్యంత నీచమైన, గర్హ నీయమైన చర్యని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బీడీ రవికుమార్ అన్నారు.స్థానిక నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపూర్ సంఘటన పై రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నోరు ఇప్పకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి, మోడీకి అనుకూల మైనప్పటికీ సంఘటన స్పందించకపోవడం క్రైస్తవుల ను కించపరచడం అన్నారు. మణిపూర్ సంఘటన నుండి లబ్ధి పొందాలని చూసే రాజకీయ పార్టీల పట్ల మైనార్టీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్య క్షులు పరిమిసాగర్ కుమార్, ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగభరత్ పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై విచారణ

విశాలాంధ్ర - లింగపాలెం : రంగాపురం వ్యవసాయ సహకార సంఘంలో వచ్చిన అవినీతి ఆరోపణలపై దర్యాప్తు చేపట్టారు. దీనికి సంబంధించి విచారణ అధికారి వేణుగోపాలరెడ్డి కార్యాలయంలో మంగళవారం విచారణ ప్రారం భించారు. ఈనెల 10 వరకు సంఘ సభ్యులను విచారిస్తామని విచారణ అధికారి తెలిపారు. దీనికి సంబంధించి 852 మంది సభ్యులకు నోటీసులు ఇచ్చామని, నోటీసులు అందుకున్న సభ్యులు వారు తీసుకున్న రుణాలపై వివరాలు తెలపాల్సి ఉందని విచారణ అధికారి అన్నారు. విచారణకు సంబంధించిన వివరాలను బహిరంగంగా వెల్లడించమని, నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు.

మణిపూర్ మతోన్మాద దాడులకు నిరసనగా ర్యాలీ

విశాలాంధ్ర -గణపవరం: మణిపూర్ మతోన్మాదుల దాడులు ఖండిస్తూ గణప వరం మండలం అర్ధవరం గ్రామంలో మంగళవారం సి.బి. సి.యన్.సి బాప్టిస్టు చర్చి సంఘ పెద్దల సమక్షంలో సంఘ కాపరి కర్తకి శేఖర్ బాబు అధ్యక్షతన కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలియచేసి అనంతరం గణపవరంలో జరిగిన అన్ని క్రైస్తవ సంఘాల సమక్షంలో జరిగిన శాంతియుత నిరసన ర్యాలీలో పాల్గొన్నారు.ఈసందర్భంగా కర్తకి శేఖర్ బాబు మాట్లాడుతూ భారత దేశంలోని ప్రజలు అందరు సోదరహావంతో కలిసిమెలిసి జీవిస్తున్న మనుషుల మధ్య రాజకీయ నాయకులు తమ వ్యక్తిగత స్వార్థాల కోసం మతవిద్వేషాలను రెచ్చగొట్టి మణిపూర్ లో అనేక మంది ప్రాణాలు కోల్పోవడానికి కారణమయ్యారని అన్నారు.జరుగుతున్న దాడులకు కారణాలు ఏమిటో ప్రజలందరూ ఆలోచించి సున్నితంగా చర్చించి భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ద్వారా ప్రజాస్వామ్య లౌకికవాదాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు సంఘస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో పశ్చిమగోదావరిజిల్లాకు ద్వితీయ స్థానం

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: జగనన్న సురక్ష కార్య క్రమం ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందజేయడంలో పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పత్రికా విలేకరులతో మాట్లాడారు. జగనన్న సురక్ష, లంక గ్రామాల్లో వరదలు, ఓట్లు నమోదు, జగనన్నకు చెబుదాం అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్ర మాన్ని జులై 1 నుండి నెలరోజుల పాటు

నిర్వహించగా జిల్లాలోని 6,40,108 కుటుంబాలకు గాను, వాటిలో 6,07,072 కుటుంబాలలో 9,532 ఇది వాలంటరీ ద్వారా సర్వే చేసినట్టు తెలిపారు. జిల్లాలోని 535 గ్రామ వార్డు సచివాలయాలలో 16 విడతలుగా జగనన్న సురక్ష గ్రామసభలు నిర్వహించినట్టు తెలిపారు. 2,13,429 కుల ధృవీకరణ పత్రాలు, 2,09,816 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 93 వివాహ ధ్రువీకరణ పత్రాలు, 11,551 ఆధార్ కు ఫోన్ నెంబర్ అనుసంధానం, 486 జనన ధ్రువీకరణ పత్రాలు, 575 మరణ ధ్రువీకరణ పత్రాలు, 250 మ్యుటేషన్ లావాదేవీలు, 422 కుటుంబ సభ్యుడి ధ్రువీకరణ పత్రాలు, 61,937 సిసిఆర్సి కార్డులు, 2,847 కొత్త, స్ప్లిట్ చేసిన రైస్ కార్డులు, 388 హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ విభజన, 1,46,813 ఇతర ధ్రువీకరణ పత్రాలు మొత్తం 6,48,607 సర్వీసులను అందజేసినట్టు తెలిపారు.

పేద విద్యార్థుల కోసం నిధి ఏర్పాటు

- ఏలూరు కథోలిక్ పీఠాధిపతి వెల్లడి

- సామాజిక సేవలో కథోలిక్ సంస్థ

విశాలాంధ్ర - లింగపాలెం : ఏలూరు కథోలిక్ పరిధిలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించి వీరు ఉన్నత విద్య చదివేందుకు ప్రోత్సహించే కార్యక్ర మానికి ప్రణాళిక చేపట్టామని కథోలిక్ పీఠాధిపతులు పొలిమేర జయరావు తెలిపారు. పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా విశాలాంధ్రకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రంగాపురంలో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఈయన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. 2027 నాటికి రూ. 3 కోట్ల నిధిని సమకూర్చి పేద విద్యా ర్థుల విద్యాభివృద్ధికి చర్యలు తీసుకునే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. ఈ నిధులకు వడ్డీ రూపంలో వచ్చే నిధులను విద్యార్థులకు ఖర్చు చేస్తామని అన్నారు. తాను పీఠాధిపతిగా బాధ్యతలు తీసుకున్న సమయంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నానని, నిబద్ధతతో వీటన్నింటిని అధిగమిస్తూ ఏలూరు కథోలిక్ పరిధిలో విద్య, వైద్య, సామాజిక, సాంఘిక సేవలను ప్రజలకు అందించటం ఆనందంగా ఉందన్నారు. సంస్థల పీఠాధిపతులు కలిసి అసోసియేషన్ ఏర్పాటు చేసే ప్రయత్నం సాగుతుందని అన్నారు. మణిపూర్ హింస దారుణంగా ఉందని, అక్కడ ప్రశాంతతకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర - లింగపాలెం : రంగాపురంలోని సెయింట్ జాన్ వృత్తి విద్యా కోర్సుల శిక్షణ కేంద్రం మొదటి వార్షికోత్సవం సంద ర్భంగా మంగళవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏలూరు కథోలిక్ పీఠాధిపతి పొలిమెర జయరావు, ఆస్ట్రియా దేశానికి చెందిన క్రైస్తవ మత బోధకులు మార్టిన్, సెయింట్ జాన్ సంస్థ నిర్వాహకులు కాట్రు యోహాను ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇంటర్ చదువుతున్న 25 మంది పేద విద్యార్థులకు రూ. 4 వేలు చొప్పున, 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 55 మంది పేద విద్యార్థులకు రూ. 2 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని నగదుతోపాటు విద్యా కిట్‌లను అందించారు. రూ. 1.25 లక్షల నగదును పేద విద్యార్థులకు ఇచ్చారు. లింగపాలెం మండలంలో విద్యాశాఖ కార్యాలయానికి శుద్దినీటి పరికరాన్ని, ధర్మాజీగూడెం పోలీస్‌స్టేషన్‌కు కంప్యూటర్‌ను అందించారు. వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులకు ఉపయోగపడే కంప్యూటర్స్, ఇంగ్లీషు నేర్చుకునే సావనీరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీఠాపతి జయరావు ఆస్ట్రియా దేశస్థుడు మార్టిన్, సెయింట్ జాన్ వృత్తి విద్యా కోర్సుల శిక్షణ స్థాపకులు కాట్రు యోహానులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్ర కరస్పాండెంట్ కాట్రు జాన్‌రాజ్, ఎంఇఓలు రామారావు, రవీంద్ర గురువులు జీవరత్నం, ఆర్.బాల, దివాకర్, ఐజక్, కుమార్, సిఆర్‌పి ఎస్.రవి, ఎఎస్ఐ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దోషులను శిక్షించాలి

విశాలాంధ్ర -భీమవరం: మణిపూర్‌లో గిరిజన తెగల మహిళలను నగ్నంగా ఊరేగించి అత్యాచారం, హత్య చేసి, అల్లర్లు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలి గించిన వారిని కఠినంగా శిక్షించాలని ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు, బార్ అసోసియేషన్ సెక్రెటరీ పాక రమేష్ డిమాండ్ చేశారు. ఐఎఎల్, భీమవరం బార్ అసోసియేషన్ అధ్వర్యంలో మణిపూర్ ఘటనలను నిరసిస్తూ కోర్టు సముదాయంలో న్యాయవాదులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా చెల్లబోయిన, పాకా మాట్లాడుతూ మణిపూర్‌లో ఒక వర్గానికి చెందిన గిరిజన మహిళాలను వివస్త్ర లుగా చేసి ఊరేగించటం హేయమైన చర్యని, శాంతి భద్రతలు కాపాడటంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని డిమండ్ చేశారు. ఘటనపై ప్రధాని ఖండించక పోవటం శోచనీయమని, పార్ల మెంటులో మణిపూర్ పై ప్రతిపక్షాలను మాట్లాడకుండా చేయడం అప్రజాస్వామికమని వారు దుయ్యబట్టారు. కార్యక్రమంలో న్యాయ వాదులు బడుగు అశోక్ బాబు, మేకా శివ, రోషన్, ఎం. శ్రీనివాసు, రాజేష్, నాగరాజు, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కారం దారయ్య ఎన్నికపై హర్షం

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా కారం దారయ్య ఎన్నికవటం పట్ల వేలేరుపాడు సిపిఐ మండల సమితి మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన గిరిజన సమాఖ్య 3వ రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర అధ్యక్షుడిగా దారయ్య ఎన్నిక కావడం వలన మండలానికి మంచి గుర్తింపు కలిగిందని సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము సంతోషాన్ని వ్యక్తం చేశారు. మారుమూల గిరిజన ప్రాంతంలో పుట్టిన ఆయన పేద, గిరిజన, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారానికి తనదైన శైలిలో అనేక పోరాటాలు చేశారన్నారు. రామవరం సర్పంచ్ జిల్లా గిరిజన సమాఖ్య అధ్యక్షుడు పిట్టా ప్రసాద్ తో పాటు పిట్టా వీరయ్య, కరటం వెంకటేశ్వర్లు, యర్రా మధు, కురిమేళ్ళ వెంకటేశ్వర్లు, బంధం నాగేశ్వరరావు, సోడే ప్రసాద్, బంధం అర్జున్, మడివి కామయ్య, పేర్ల వెంకటేశ్వరావు, కారం బోజ్జి, కరటం సీతామహాలక్ష్మి, సోడే చిన్నమి, సరియం విమల, పిట్టా సాయమ్మ, మడకం సునీత, రజినీ తదితరులు దారయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - భీమవరం టౌన్ : మణిపూర్ లో జరుగుతున్న మారణకాండపై గత కొన్ని రోజులుగా క్రైస్తవులు చేస్తున్న శాంతి నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళ వారం పలు క్రైస్తవ సంఘాలు భారీ సంఖ్యలో భీమవరం పట్టణంలో శాంతి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ మేడిది జాన్సన్ మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణకాండ, అత్యాచారాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కలుగజేసుకుని పరిష్కరించా లన్నారు, శాంతిని ప్రకటించేది క్రైస్తవత్వం,శాంతిని బోధించేది క్రైస్తవం, అటువంటి క్రైస్తవులపై మారణకాండ తగదు అన్నారు. ఈ ర్యాలీకి ముస్లిం ప్రతినిధులు, పలు క్రైస్తవ సంఘాలు భారీ సంఖ్యలోపాల్గొన్నారు..

దారయ్య ఎంపిక పట్ల డేగా ప్రభాకర్ హర్షం

విశాలాంధ్ర-ఏలూరు: ఏపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షునిగా వేలేరుపాడుకు చెందిన కారం దారయ్య ఎంపిక పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం డేగా ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ దారయ్య విద్యార్థి దశ నుండి విద్యార్థుల హాస్టల్ సమస్యలపై పోరాటాలు చేస్తూ అంచెలం చెలుగా ఎదిగి గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ, ఏజెన్సీ ప్రాంతంలో నిరంతరం గిరిజనుల సమస్యలపై పోరాడే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. గిరిజనుల సమస్యలు గుర్తించి, అటవీ బంజరు, పోడు భూములు గిరిజనులకు దక్కించే ప్రయత్నంలో రెండు దశాబ్దాలకు పైగా పోరాడుతున్న వ్యక్తిగా దారయ్య గుర్తింపు పొందారని తెలిపారు. దారయ్య గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ భవిష్యత్తులో గిరిజన సమాఖ్య బలోపేతానికి, సమస్యల పరిష్కారానికి తన శక్తి యుక్తులు వినియోగించాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణారావు

విశాలాంధ్ర - నిడమర్రు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ చట్టాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిడమర్రు మండలం పెదనింద్రకొలను లో జరుగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశానికి ముఖ్య అతిథిగా రమణారావు పాల్గొని మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం 2009 నుండి అధికారంలోకి వచ్చిన నాటి నుండి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాల అమలు చేయకుండా ప్రభుత్వం ఇచ్చిన 12, 14 మెమోని రద్దు చేసి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన 1280 కోట్ల రూపాయల నిధులను సంక్షేమ బోర్డుకి జమ చేసి పెండింగ్ క్లైములు పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో చిని మిల్లి రాంబాబు, సోడాబత్తుల వాసు, కందులపాటి సుబ్బారావు, ఎ.మార్తరాజు, చల్లగాలి పెద్దిరాజు, ఎస్. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఈనెల 23, 24 తేదీలలో ఏలూరులోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో జరిగే ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఏలూరు జిల్లా జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఏఐటియుసి మండల కార్యదర్శి కుంచె వసంతరావు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)గౌరవాధ్యక్షులు జే.వి.రమణ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహా సభల కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీలలో 52 వేల మందికి పైగా పర్మినెంట్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.వీరిలో పారిశుధ్య కార్మికులు కరోనా సమయంలో చేసిన సేవలు మరువలేనివన్నారు. ప్రభుత్వం స్పందించి వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, హెల్త్ , రిస్క్ అలవెన్స్ , అర్జిత సెలవులు తదితర సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.పిఎఫ్ ఖాతాలు ప్రారంభించి, హెల్త్ కార్డులు జారీ చేయాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దించాలని డిమాండ్ చేశారు.జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి కూనపాముల విఘ్నేష్ మాట్లాడుతూ కార్మికుల పక్షాన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి)ఎన్నో పోరాటాలు నిర్వహించిందన్నారు. మున్సిపల్ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం స్థానిక మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ఈ మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకుని జిల్లాలోని మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఒక పోరాట మార్గాన్ని రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొత్తూరి నాగేశ్వర రావు,యూనియన్ కార్యవర్గ సభ్యులు కొత్తూరి ఎమిలేశ్వరరావు, ముప్పిడి శ్రీను,అల్లే శ్రీను, యడ్లపల్లి ప్రసాద్, జాలా వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ విభాగ కార్మికులు కంతేటి వెంకట్రావు, ఎస్.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యలో ఉత్తమ విద్యాబోధన

విశాలాంధ్ర - ముసునూరు : 2021-22వ సంవత్సరంలో పదో తరగతి పరిక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఘనత చెక్కపల్లిలోని చైతన్య ఇంగ్లీషు మీడియం స్కూల్‌కే దక్కుతుందని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మరీదు నాగరాజు అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన సాయిల కుసుమ దీప్తి 566 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందన్నారు. 2022-2023వ సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో ఎం.లావణ్య 569 మార్కులు సాధించి ,మండల టాపర్‌గా నిల్చిందన్నారు. 2015-2016వ సంవత్సరం నుండి ఇప్పటి వరకు ఇంగ్లీషు మీడియంతో అనుభవం కల్గిన ఉపాధ్యాయులతో ఉత్తమ విద్యాభోధన అందిస్తున్నట్లు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : పట్టణంలో బుధవారం మార్కెట్లో రూ. 5కోట్ల 58 లక్షలతో నిర్మించిన విద్యుత్ జి ఐ ఎస్ సబ్ స్టేషన్ ను మంగళవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సబ్ స్టేషన్ వల్ల పట్టణ ప్రజలకు విద్యుత్ సరఫరాలో మరింత నాణ్యత కలిగిన విద్యుత్తును అందించడం జరుగుతుందని అన్నారు. 244 గజాల స్థలంలో భీమవరం మెయిన్ సెంటర్లో ఈ విద్యుత్ సబ్ స్టేషన్ ను నిర్మించడానికి ప్రభుత్వం రూ.5కోట్ల 58 లక్షల నిధులను మంజూరు చేయడం, నిర్మాణ పనులు వెంటనే పూర్తి కావడం జరిగిందన్నారు. అతి త్వరలోనే ఈ సబ్ స్టేషన్‌ను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడిఏ రాజగోపాల్ చౌదరి, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, జెసిఎస్ కన్వీనర్ చెల్లబోయిన సూర్య ప్రకాష్, టౌన్ ప్లానింగ్ ఏసిపి గౌరు తదితర అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి 7 వరకు డిపార్టుమెంటల్ పరీక్షలు

హాజరు కానున్న 181 మంది అభ్యర్థులు

విశాలాంధ్ర-ఏలూరు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ పరీక్షలు ప్రశాంత వాతా వరణంలో నిర్వహించ డానికి అన్ని శాఖల అధికారులతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఏవి ఎన్ఎస్ మూర్తి తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లోని డిఆర్ఓ ఛాంబర్‌లో మెడికల్, పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, శాఖల అధికారులతో డిపార్ట్‌మెంట్ పరీక్షల నిర్వహణపై డిఆర్ఓ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిఆర్ఓ ఎవిఎన్ఎస్ మూర్తి మాట్లాడుతూ బుధవారం నుండి 7వ తేదీ వరకు డిపార్ట్మెంటల్ పరీక్షలు పెదపాడు మండలం వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ సి .బి. ఎస్.ఇ స్కూల్‌లో ఆన్‌లైన్ ఆఫ్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ పరీక్షలకు వివిధ శాఖలకు చెందిన 181 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని పోలీస్ అధికారులకు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఇన్విజిలేటర్, ఏపీపీఎస్సీ అధికారులు, పరీక్ష నిర్వహణకు కేటాయించిన సిబ్బంది తప్ప ఇతర సిబ్బంది, వ్యక్తులు ఉండరా దని తెలిపారు. అభ్యర్థులు ఏపీపీఎస్సీ జారీ చేసిన హాల్ టిక్కెట్లతో పరీక్ష కేంద్రానికి హాజరు కావలసి ఉంటుందన్నారు. సమావేశానికి ఏపీపీఎస్సీ ఎస్ వో ప్రేమ కుమారి, ఏ ఎస్ ఓ. ఎం. భవాని., సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ప్రసాద్ నాయుడు, హెల్త్ డిపార్ట్మెంట్ తరపున నరేంద్ర, సిద్ధార్థ స్కూల్ తరపున శ్రీనివాసరావు, ఆర్టీసీ తరపున వేణుగోపాల్, విద్యుత్ శాఖ తరపున ప్రవీణ్, కలెక్టరేట్ లోని హెచ్ సెక్షన్ సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

సామాన్య ప్రయాణికుడికి ఆటో మూలం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : ఎలాంటి సమయమైనా ఒక్క పిలుపుతో మనం చేరాల్సిన చోటుకి చేర్చే వాడు ఆటో డ్రైవర్. సామాన్య ప్రయాణికుడికి ఆటో మూల సాధనమని భీమవరం ట్రాఫిక్ సిఐ జి. దాస్ అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక, ఆటో యూనియన్ అధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం, పురస్క రించుకొని మంగళవారం 5 గురు ఆటో డ్రైవర్లకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సామాన్య మానవునికి దగ్గర దూరం లేకుండా ఆటో ఒక ప్రయాణ సాధనంగా ఉంటుందని, ఎంతో మంది ఆటోలపై జీవనం సాగిస్తున్నారని, అందరూ ఖచ్చితంగా నిబంధనలను పాటిస్తూ ప్రయాణికులకు గమ్య స్థానాలకు చేర్చాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయిమాట్లాడుతూ పూర్వం గుర్రపు బళ్ళు, రిక్షాలు మరెన్నో ప్రయాణ సాధనాలుగా ఉండేవని, కాలక్రమేణ ఆటో ప్రయాణ సాధనంగా సామాన్య లకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు నరహరిశెట్టి కృష్ణ మాట్లాడుతూ సీనియర్ డ్రైవర్లు పెంటకోటి శివరాం, గేదల యాకోబు, కొక్కిరగడ్డ ఏసు రత్నం, జాన్ విక్టర్, పల్లయ్యలను సత్కరించామని తెలిపారు. అనంతరం పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్, బాంబే స్వీట్ సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఆటో యూనియన్ నాయకులు పంపన గోపి, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ముంపునకు గురైన పొలాల రైతులకు విత్తనాలు సరఫరా

విశాలాంధ్ర-ముదినేపల్లి : ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ముంపునకు గురై దెబ్బతిన్న వరి పొలాల రైతులకు వ్యవసాయ శాఖ విత్తనాలు సరఫరా చేస్తుందని మండవల్లి వ్యవసాయ శాఖ ఏడిఏ జి. వెంకటమణి తెలిపారు. మండలంలో ముంపుకు గురైన వరి పొలాలను అన్నవరం, వడాలి, శ్రీహరిపురం, సింగరాయపాలెం, పెద్దగొన్నూరు , వణుదుర్రు , వాడవల్లి ఆర్బికె పరిధిలోని గ్రామాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా నష్టపోయిన రైతులతో చర్చించారు. పొలాల్లో వర్షం నీటిని బయటికి తరలించి బూస్టర్ డోస్‌గా ఎకరాకు 20 కిలోల యూరియా 15 కిలోల ఎంఓపి కలిపి వేసుకోవాలని , జింకుధాతు లోప నివారణ కొరకు ముడిజింకు లీటర్ నీటిలో రెండు గ్రాముల చొప్పున ఎకరాకు 400 గ్రాములు పిచికారి చేయాలి లేదా చలామిన్ ఎకరాకు 100 గ్రాములు చొప్పున పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏవో జరీనా, ఆర్ బి కే సిబ్బంది పాల్గొన్నారు.

సాహితీ వేత్త రంగరాజుకు సత్కారం

విశాలాంధ్ర-ఉండి: సాహిత్య రంగంలో విశేష సేవ చేస్తున్న సాహితీ వేత్త, కవి, కార్టూనిస్ట్, రచయిత, నటుడు గాదిరాజు రంగరాజును సోమవారం రాత్రి నరసాపురంలో సత్కరిం చారు. ఆ వివరాలను మంగళ వారం ఆయన విలేకరులకు అందించారు. అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో బాల బంధు గద్వాల సోమన్న రాసిన అమ్మ ఒడి ప్రేమ బడి పుస్తకావిష్కరణ సభలో రంగరాజు వక్తగా ప్రసంగించారు. ఈ సందర్భంగా సోమన్న రంగరాజును ఎమ్మిగన్నూరు ఖద్దరు వస్త్రంతో సత్కరించారు. ప్రముఖ వ్యాఖ్యాత శిరోమణి రెడప్ప ధవేజీ మాట్లాడుతూ సాహిత్యంలో రాణిస్తున్న కవుల్లో గాదిరాజు రంగరాజు ఒకరు కావటం అతను పశ్చిమ గోదావరి జిల్లా వాసి కావడం మన అందరికి ఎంతో గర్వంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గురు సహస్ర అవధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్, లయన్ జిల్లా పాస్ట్ గవర్నర్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ,కవి పెన్మెత్స సత్యనారాయణ రాజు (బాబుశ్రీ), ప్రఖ్యాత పద్య కవి, రచయిత మంకు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దమ్ము ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

విశాలాంధ్ర -పాలకోడేరు: మండల పరిధి పాలకోడేరు గ్రామంలో మంగళవారం పల్లం పొలాలు అడ్డకోడు వద్ద ట్రాక్టర్ దమ్ము చేసి అనంతరం గట్టుపైకి ఎక్కుతుండగా ట్రాక్టర్ తిరగబడింది. దీంతోడ్రైవర్ గుండుభోయిన సత్యనారాయణ (39) ట్రాక్టర్ కింద పడటంతో చుట్టుపక్కన ఉన్న రైతులు, కూలీలు పరుగుపరుగున వచ్చి ట్రాక్టర్ కింద ఉన్న వ్యక్తిని తీసే ప్రయత్నం చేసినా విఫలం కావడంతో జెసిబి సహాయంతో ట్రాక్టర్ ను తొలగించారు. అప్పటికే సత్యనారాయణ మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు. సంఘ టనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : తల్లిపాలే బిడ్డకు అమృతమని, నవజాత శిశువు ఆరోగ్యంగా పెరగడానికి తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయని డిఎంహెచ్ఓ డి మహేశ్వరరావు అన్నారు. మంగళవారం ప్రభుత్వ వైద్య శాఖ ఆధ్వర్యంలో భీమవరం లూథరన్ కళాశాలలో ప్రపంచ తల్లిపాలు వారోత్స వాల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి సిద్ధంగా లభించే పాలు బిడ్డకు ఎంతో మేలు చేస్తాయని, బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇవ్వాలన్నారు. బిడ్డ శారీరక మానసిక ఎదుగుదలకు అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రోటీన్స్, విటమిన్లు వంటి పోషకాలన్నీ తల్లిపాలలో సమతూకంలో ఉంటాయని, కాన్పు తర్వాత మొదటి, రెండు, మూడు రోజుల్లో వచ్చే ముర్రుపాలు చాలా ముఖ్యమని, ఇవి ఒక రకంగా తొలి టీకా లాంటివన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త చెరుకువాడ రంగసాయి, డిఆర్ ఎంహెూ డాక్టర్ సుగుణ రాజు, ఎస్ వో సర్వేశ్వర ప్రసాద్, కంప్యూటర్ సెక్షన్ పి.భాస్కరరావు, హెల్త్ సూపర్ వైజర్స్, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత

విశాలాంధ్ర-ఉంగుటూరు: దోమల నియంత్రణ అందరి బాధ్యత అని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం చేబ్రోలు, కాగుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో డా.కే.ఎస్.వర్మ, డా.శ్రావణ్, డా.పి.మానస, డా.శిరీష ల అధ్యక్షతన ఆశా డే సమావేశం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి కే.శ్రీనివాసరావు, సామాజిక ఆరోగ్య అధికారి కే.రత్నరాజ్యం, ఆరోగ్య ఈ.వి.సుబ్బలక్ష్మిలు పాల్గొన్నారు.

నాచుగుంటలో పొలంబడి

విశాలాంధ్ర-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామంలో మంగళవారం డాక్టర్ వైయస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఉంగుటూరు ఏవో బాలిన వెంకటేష్ మాట్లాడుతూ పొలంబడి రైతులకు మట్టి నమూనాల సేకరణ, వాటి ఫలితాల విశ్లేషణ ఏ విధంగా చేస్తారో రైతులకు వివరించారు. సార్వా సాగు ఆశాజనకంగా ఉందని, రైతులు పంట పొలాలపై విచక్షణ రహితంగా ఎరువులు పురుగులు మందులు చల్ల వద్దన్నారు. కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులందరు ఈ-పంట నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-టీ నరసాపురం: రైతులందరు ఈ-పంట నమోదు చేయించుకోవాలని తహశీల్దార్ జె వి సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో ఈ-పంట నమోదు పై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈ-పంట నమోదు చేయించుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే భీమా పొందవచ్చునని తెలిపారు. రైతు పండించిన పంటను సులభంగా విక్రయించుకోవచ్చున్నారు. రైతు భరోసా వంటి పలు సౌకర్యాలు పొందవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి డి.ముత్యాల రావు, వీఆర్వోలు, వ్యవసాయ, ఉద్యానవనం సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గైర్హాజరవుతున్న వలంటీర్ల తొలగింపు

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: విధులకు తరచుగా గైర్హాజరవుతున్న 5గురు వార్డు వాలంటీర్లను విదుల నుండి తొలగించామని సచివాలయ కార్యదర్శి కృష్ణకుమారి తెలిపారు. ద్వారకాతిరుమల మండలం సత్తెనగూడెంకి చెందిన కుమ్మరి జ్యోతి, మానుకొండ శ్రీమన్నారాయణ, తానిగడప ప్రసన్న, బంటుమిల్లి శ్యామల, దున్నసాయికుమార్‌లు తమ విధులు సక్రమంగా నిర్వర్తించని కారణంగా 5గురు వాలంటీర్లను తమ విధులనుండి తొలగించినట్లు కృష్ణవేణి పేర్కొన్నారు.

ఏఈవోగా వాసుకు ప్రమోషన్

విశాలాంధ్ర-ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎంఎస్ఎల్ శ్రీనివాస్ (వాసు)ని సీనియార్టీ ప్రకారం ఏఈవోగా పదోన్నతి కల్పిస్తూ దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు ఆలయ కార్యనిర్వాహణాదికారి వేండ్ర త్రినాదరావు ఏఈవోగా పదోన్నతి పొందిన ధృవీకరణ పత్రాన్ని మంగళవారం అందజేశారు. ప్రమోషన్ పొందిన వాసుని అధికారులు, ప్రజాప్రతినిదులు, దేవస్థానం సిబ్బంది, ప్రజలు ప్రత్యక్షంగా అలాగే సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేశారు.

రామచంద్ర విగ్రహానికి పూలమాలలు

విశాలాంధ్ర-ఉంగుటూరు: దివంగత మాజీ సర్పంచి గుణ్ణం రామచంద్రరావు గ్రామానికి చేసిన సేవలు నేటికీ మరువలేవమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామంలో రెండు చోట్ల దివంగత మాజీ సర్పంచ్ గుణ్ణం రామచంద్రరావు 67వ జయంతి వేడుకలు నిర్వహించారు. అరుంధతిపేట, పంచాయతీ కార్యాలయాల వద్ద ఉన్న గుణ్ణం రామచంద్రరావు విగ్రహాలకు పలువురు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర రావు అభిమానులు, యువకులు, నారాయణపురం సర్పంచ్ దిడ్ల అలకనంద శ్రీనివాస్, ఉంగుటూరు మండలం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నల్లా ఆనంద్ కుమార్, పార్టీలకు అతీతంగా రామచంద్ర రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-కొయ్యలగూడెం : వరద బాధితులను ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు రావాలని కొయ్యలగూడెం మండల మానవతా శాఖ సంస్థ అధ్యక్షులు బొమ్మ మోహనరావు పేర్కొన్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా ముంపునకు గురైన పోలవరం నియోజకవర్గం వేలూరుపాడు మండలాల్లో చిగురు మామిడి, తూర్పు మెట్ట, బోడపల్లి, తదితర గ్రామాలలో 500 మంది వరద బాధితులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేసినట్టు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా మోహన్ రావు మాట్లాడుతూ ముంపునకు గురైన గిరిజన గ్రామాల ప్రజలను ఆదుకోవడానికి స్వచ్ఛంద సేవా సంస్థల వారు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముప్పనపల్లి వెంకటేశ్వరరావు , భవిరిశెట్టి నాగేశ్వరావు, వి ఎస్ ఎన్ స్వామి, నక్క బాబి, చంటిబాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీని ఒక మహాశక్తిగా తీర్చిదిద్దడం టిడిపికే సాధ్యం

విశాలాంధ్ర - పాలకొల్లు: స్త్రీ శక్తిని ఒక మహా శక్తిగా తీర్చిదిద్దడం ఒక్క టిడిపికి మాత్రమే సాధ్యమని టిడిపి రాష్ట్ర తెలుగు మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి అన్నారు.మంగళవారం పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామంలో కోడిదుంప అంబేద్కర్ బొమ్మ వద్ద నుండి మహాశక్తి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కర్నేన రోజా రమణి మాట్లాడుతూ మహానాడు సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో "భవిష్యత్తుకు గ్యారెంటీ" సూపర్ సిక్స్ లో భాగంగా మహిళలకు పెద్దపీట వేశారని అన్నారు. మహిళా సాధికారత కోసమే మహాశక్తి పథకాన్ని ప్రవేశపెట్టారని మహిళలందరూ ఉత్సాహంగా పాల్గొని మహాశక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికలలో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్పంచ్ చొప్పల రజిని, ఎంపీటీసీ ఆకుల ధనలక్ష్మి, ద్రాక్షారపు జ్యోతి, తమ్మా లక్ష్మి, పాలా విజయ కుమారి, పోలినాటి నాగలక్ష్మి, బందారు ఆదిలక్ష్మి, కేతా భవాని, పితాని ఝాన్సీ రాణి, తాళ్లూరి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పంపిణీ పరిశీలన

విశాలాంధ్ర-ఉంగుటూరు: ప్రతి నెల ఒకటో తేదీన ఇంటి వద్దకే పెన్షన్ ఇచ్చే కార్యక్రమం సమర్ధవంతంగా జరుగుతుందని ఉంగుటూరు మండల ఎంపీటీసీ ఛాంబర్ అధ్యక్షులు బందారు నాగరాజు అన్నారు. మంగళవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో పెన్షన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వాలంటరీ తో పాటు ఆయన కూడా ఇంటింటికి వెళ్లి వృద్దులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్లను పరిశీలించారు. మండలంలో అన్ని గ్రామాల్లో పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు ఉంగుటూరు ఎంపీడీవో ఆంజనేయ తెలిపారు.

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై శ్రద్ధ చూపాలి

విశాలాంధ్ర-చాట్రాయి: ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రసాయనాలు లేని ఆరోగ్యవంతమైన పంటలు పండించడం ద్వారా ప్రజలందరను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంచవచ్చని చాట్రాయి పంచాయతీ సర్పంచ్ దామెర ఉషా తెలిపారు. మంగళవారం చాట్రాయి రైతు భరోసా కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చినటువంటి నవధాన్యాల కిట్లను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మన పూర్వీకులు రసాయనాలు లేకుండా సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేసి పంటలు పండించిన ఆహార పదార్థాలను తినడం వలన దీర్ఘకాలం ఆయురారోగ్యాలతో ఉండేవారని గుర్తు చేశారు. ఆధునిక వ్యవసాయ పద్ధతిలో పురుగు మందులు ఫెర్టిలైజర్లు అత్యధికంగా వాడకం వలన వాటిని తినడం వలన ప్రజల ఆరోగ్యం త్వరగా క్షీణిస్తుందని ఆయుష్షు తగ్గిపోతుందన్నారు. అందుకోసమే ప్రతి రైతు కనీసం ఒక అరఎకరా భూమి నైనా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సేంద్రియ ఎరువుల ద్వారా పండించి ఆహార పదార్థాలుగా తీసుకోవడం వలన మొత్తం కుటుంబాన్ని వారిని ఆరోగ్యంగా ఉంచిన వారు అవుతారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నియమాలు పాటించాలి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : ఆటోలు నడిపే ప్రతి ఒక్కరు రహదారి నియమ నిబంధనలు తప్పక పాటించాలని ప్రమాదాలు జరగకుండా చూడాలని జగదాంబ ఆటో యూనియన్ అధ్యక్షులు దేవుడు శ్రీను సూచించారు. మంగళవారం జీలుగుమిల్లి పాత సినిమా హాలు వద్ద ఆటో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్సు ఆటో సంబంధించిన రికార్డులు తమ వద్ద జిరాక్స్ కాపీలు ఉంచుకోవాలని అన్నారు. రహదారిపై ట్రాఫిక్ నిబంధనలు పాటించి అంతరాయం లేకుండా చూడాలని తెలిపారు. ప్రభుత్వం అందించే వాహన మిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జగదంబ ఆటో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కేసు బోయిన సత్యనారాయణ, కార్యదర్శి నందికోలా డేవిడ్, సభ్యులు మేకల దుర్గారావు, దాసరి ఏసు, మేకల శ్రీను, పి.పుల్లారావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

శ్రేష్ఠకు 21 మంది గురుకుల విద్యార్థులు

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్ : పెదతాడేపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు స్కీమ్ ఫర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషన్ ఎస్సీ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్ టార్గెటెడ్ ఏరియా (శ్రేష్ట)కు మొదటి విడతలో 21 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి. రాజారావు తెలిపారు. మంగళవారం పాఠశాలలో శ్రేష్టకు ఎంపికైన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజారావు మాట్లాడుతూ ఎస్సీ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రవేటు పాఠశాలల్లో సీట్లు కల్పించి చదివించే నదుపాయం ఏర్పాటు చేయడం శ్రేష్ఠ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ జస్టిస్ ఎన్ పర్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రవేశ పరీక్షలో దేశవ్యాప్తంగా 3 వేల మందికి అవకాశం లభిస్తుందన్నారు. ఈ ప్రవేశ పరీక్షలో గురుకుల పాఠశాల నుంచి 75 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. సోమవారం జరిగిన మొదటి విడతలో 24 మంది విద్యార్థులు అర్హత సాధించడం అభినందనీయం అన్నారు. వీరికి ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్ర, ఒరిస్సా, కేరళ, ఛత్తీస్గడ్ తదితర రాష్ట్రాల్లోని ప్రవేటు పాఠశాలల్లో సీట్లు లభిస్తాయని తెలిపారు. అత్యంత ప్రతిభ ఘనపరచిన విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలు సాధించాలని ఆకాంక్షిం చారు. అనంతరం ప్రిన్సిపల్ రాజారావును విద్యార్థుల తల్లిదండ్రులు సత్కరించారు. సీట్లు సాధించిన విద్యార్థులను డిసిఓ ఎన్. భారతి, ప్రిన్సిపాల్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్ బి. ప్రతాప్, స్కూల్ కమిటీ చైర్మన్ ఆర్. శ్రీను, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది అభినందించారు.

తాతాజీ దాతృత్వం

మహిళలకు కుట్టు మిషన్ అందజేత

విశాలాంధ్ర - పాలకొల్లు: పాలకొల్లు మండలం వరిధనం గ్రామంలో వృత్తిరీత్యా టైలరింగ్ చేసుకునే ఓ ఒంటరి మహిళకు చేయూత అందించారు డిసి ఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ. ఆర్థిక ఇబ్బందులలో ఉన్న ఒక మహిళ కుట్టుమిషన్ ఇప్పించాలని కోరింది. మానవతా దృక్పథంతో ఆలోచించిన తాతాజీ మంగళవారం ఆమె స్వగృహంకు వెళ్లి, స్వయంగా కుట్టుమిషన్ అందించారు. ఈ సందర్భంగా యడ్ల తాతాజీ మాట్లాడుతూ పాలకొల్లు నియోజక వర్గంలో ఆర్థిక పరంగా ఇబ్బందుల్లో ఉన్న 40మంది మహిళలను గుర్తించి, త్వరలో వారికి కుట్టులో తగ్గిన శిక్షణ అందిస్తామని, ఉచితంగా కుట్టు మిషన్స్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని కుటుంబాన్ని పోషించు కునే విధంగా వారి జీవితాన్ని బలోపేతం చేయడమే తన లక్ష్యమని యడ్ల తాతాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ అధ్యక్షుడు వర్ధనపు మోహన్, ఉపాధ్యక్షుడు పెచ్చెట్టి ఏడుకొండలు, కవురు ఆంజనేయులు, కవురు వెంకట హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.

జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘ పోరాటం సత్ఫలితాలను ఇస్తోంది

విశాలాంధ్ర - పాలకొల్లు: జై భారత్ క్షీరారామ ఆక్వారైతు సంఘం ఆధ్వర్యంలో రొయ్య రైతుల గిట్టుబాటు ధర కోసం సమైక్యంగా చేస్తున్న పోరాటంలో మంచి ఫలితాలు వస్తున్నాయని సంఘ అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్ తెలిపారు. మంగళవారం పాలకొల్లు ఆక్వా సంఘ కార్యాలయంలో గాంధీ భగవాన్ రాజు మీడియాతో మాట్లాడుతూ. గతంలో మాదిరిగా 10 కౌంట్ కాకుండా, ప్రతి 5 కౌంట్ కు ధర పెంచాలని కాకినాడలో ప్రాసెసింగ్ యూనిట్ నిర్వాహకుల సమావేశంలో నిర్ణయించడం శుభ పరిణామం అన్నారు. ఈనెల 5న హేచరీలు,11న ఫీడ్ యాజమాన్యంతో విజయ వాడలో అప్పడా సమావేశాలు ఏర్పాటు చేయడం, తమ పోరాటంలో విజయానికి తొలిమెట్టుగా భావించాలని అన్నారు.ఇంకా సమా వేశంలో ప్రధాన కార్యదర్శి బోనం చినబాబు, ఉపాధ్యక్షులు కోడి విజయ భాస్కర్ , కోశాధికారి బోనం రంగయ్య నాయుడు, జాయింట్ సెక్రటరీలు మేడిది జాన్ రాజు,మేకా ఫణీంద్ర పాల్గొన్నారు.

లోకమాన్య తిలక్ వర్ధంతి

విశాలాంధ్ర - తాళ్లపూడి :రాగోలపల్లి లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల లో మంగళవారం భారత జాతీయోద్యమ పిత తిలక్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు ఉపాధ్యాయులు, విద్యార్థులు సిబ్బంది తిలక్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ బాల గంగాధర తిలక్ బాల్యంలో చాలా చురుకైన విద్యార్థి అని, అన్యాయం ఎక్కడ జరిగినా సహించేవాడు కాదని, నిజాయితీ, ముక్కుసూటితనం ఎక్కువఅని, కళాశాలకు వెళ్లి ఆధునిక విద్యనభ్యసించిన తొలితరం యువకులలో ఈయన కూడా ఒకరన్నారు. గణితంలో మంచి ప్రావీణ్యత, ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారని తెలిపారు. హెూమ్ రూల్ ఉద్యమాన్ని స్థాపించాడన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి రోడ్డుకు మరమ్మతులు

విశాలాంధ్ర - తాళ్లపూడి : బల్లిపాడులో ఆర్ అండ్ బి రోడ్ మరమ్మతులకు సర్పంచ్ చర్యలు చేపట్టారు. తాళ్ళపూడి మండలం లో ఛిద్రంగా మారిన ఆర్ అండ్ బి రోడ్లు విషయంలో ప్రజల ఇబ్బందులను తొలగించే తాత్కాలిక పరిష్కారాలు కోసం ఆయా గ్రామాల సర్పంచ్‌లు స్పందించాలని రాష్ట్ర హెూమ్ శాఖా మంత్రి ఆదేశించడం తో బల్లిపాడు సర్పంచ్ వెంటనే స్పందించారు. బల్లిపాడు లో పాడైపోయిన, గోతులు పడ్డ ఆర్ అండ్ బి రోడ్ ను సుమారు 20 వేల రూపాయల వ్యయం తో గ్రామస్థుల సహకారంతో పనులు చేపట్టారు. వర్షాకాలం కావటంతో డ్రైన్ పనులు కూడా చేపట్టామని సర్పంచ్ ఎల్లిన శివరామకృష్ణ తెలిపారు.

భారతదేశ చిహ్నాలను అవమానించడం బాధించింది

విశాలాంధ్ర - జగ్గంపేట : జగ్గంపేట పట్టణంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జికి చిత్రీకరించిన భారతదేశ చిహ్నాలను అవమానించడం బాధ కలిగించింది, వాటిపై పెట్టిన ఫ్లెక్సీలను తొలగించాలని పెద్దాపురం పట్టణానికి చెందిన రాపాక వెంకట దుర్గాప్రసాద్ జగ్గంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సంధర్భంగా ఫ్లై ఓవర్ బ్రిడ్జికి అటు, ఇటు స్వాతంత్ర సమరయోధులు, జాతీయ నాయకులు, భారతీయ చిహ్నాల చిత్రాలను చిత్రీకరించారు. ఆ చిత్రీకరించిన చిత్రాలపై వివిధ రకాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అవమానిస్తున్నారు. ఒక భారతీయుడిగా ఆ సంఘటన నాకు బాధ కలిగించింది అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

సుబ్రహ్మణ్యం స్వామి గుడిలో సామాన్లు అపహరణ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామంలో వేంచేసియున్న పొలిమేర నాగ సుబ్రమణ్యం స్వామి వారి గుడిలో సోమవారం అర్ధరాత్రి సమయంలో తాళం వేసిన గదిని తీసి గదిలో ఉన్న సామాన్లు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని ఆలయ ధర్మకర్త సిరిదెళ్ల అబ్బులు గురువు తెలియజేశారు. మైకు, ఏమ్ప్లి వైరు, ప్రసాదం చేసుకునే రాగి పాత్రలు, వంట చేసుకునే సామాన్లు, స్వామివారి దుస్తులు, గుడికి సంబంధించిన సామాన్లన్నీ దొంగిలించడం జరిగిందన్నారు. ఈ దొంగిలించబడ్డ వస్తువుల విలువ సుమారు 60 వేల రూపాయలు ఉంటుందని అబ్బులు గురువు అన్నారు. ఇదివరకు రెండు మూడు సార్లు ఈ గుడిలో ఉన్న సామాన్లు దొంగలు అపహరించుకుపోయారని గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు, గ్రామస్తులు తెలిపారు. వారిపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు.

టిడిపి ప్రయత్నాలను తిప్పి కొట్టండి

విశాలాంధ్ర -అనపర్తి : దొంగ ఓట్లను చేర్పించే టిడిపి ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గం పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ ఇన్‌చార్జిల సమావేశంలో ఎమ్మెల్యే సత్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ కీలకమైనదని, వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే వక్రబుద్ధితో తెలుగుదేశం పార్టీ దొంగ ఓట్లను చేర్చే ప్రయత్నాలు మొదలు పెట్టిందన్నారు. దీనిని వైఎస్ఆర్‌సిపి తరపున ఏర్పాటు చేసిన బూత్ ఏజెంట్లు తిప్పి కొట్టాలని అన్నారు. .వైసిపి నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీల ఇన్‌చార్జి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ప్రభుత్వ అధికారులైన బిఎల్ఓ లతో పాటు పార్టీ తరపున ఏర్పాటు చేసుకున్న బి.ఎల్.ఎ వ్యవస్థ ఎలా పని చేయాలి, ఓటర్ జాబితా సవరణలో అనుసరించే విధానాల పై సూచనలు చేశారు.

నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో డయాలసిస్, కిడ్నీ కేర్ పై అవగాహన

విశాలాంధ్ర- రాజమండ్రి: డయాలసిస్ రోగుల రోజువారీ జీవితంపై ప్రభావం చూపే అంశాలపై నెఫ్రోప్లస్ ఆధ్వర్యంలో 'ఆషాయెయిన్' అనే పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నెఫ్రోప్లస్ సహ వ్యవస్థాపకుడు కమల్ డి షా మాట్లాడుతూ ఈ ఒక్క రోజు నిడివి గల ఎడ్యుటైన్‌మెంట్ ఈవెంట్ కి హాజరైన వారికి అద్భుతమైన లెర్నింగ్ గ్రౌండ్‌గా నిలిచిందన్నారు. దీనిలో 130 మంది రోగులు, వారి సంరక్షకులు పాల్గొన్నారని తెలిపారు. రోగులు తమ తోటి వారితో కనెక్ట్ అవ్వడానికి ఉపయోగించుకున్నారని చెప్పారు. ఆషాయెయిన్ విద్యా కార్యక్రమం మాత్రమే కాదు, దయాలసిస్ రోగులకు ఇది ఒక అద్భుత అవకాశం అన్నారు. రోగనిర్ధారణ తర్వాత కూడా సంపూర్ణమైన, చక్కటి జీవితాన్ని గడపడం సాధ్యమవుతుందన్నారు. ఆషాయెయిన్ ద్వారా దయాలసిస్, మూత్రపిండ సమస్యలతో బాధపడుతున్న రోగులకు కొత్త జీవన ప్రమాణాలను నెలకొల్పాలని ఆశిస్తున్నామన్నారు. దయాలసిస్ రోగుల జీవితాల్లో వెలుగునిచ్చేందుకు వైద్యులు బీఎస్ఆర్ రమేష్, కే సంజీవరావు వంటి నెఫ్రాలజీ రంగానికి చెందిన విశిష్ట నిపుణులు ప్యానెల్‌కు ఆహ్వానించబడ్డారన్నారు.

ఎమ్మెల్యే భవానీని విమర్శించే అర్హత వైసీపీ నేతలకు లేదు

విశాలాంధ్ర బ్యూరో - రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరంలో మహిళలు గర్జిస్తున్నారు.. ఒక పార్టీ పై మరోపార్టీ విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నారు. పగ లంతా ఫ్యాన్ కింద కూర్చుని... రాత్రి సమయాల్లో సైకిల్ ఎక్కుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది మహిళలు లేడి కట్టప్పలని తెలుగుదేశం పార్టీ రాజమండ్రి పార్లమెంట్ మహిళ కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, రాష్ట్ర అంగన్ వాడీ కమిటీ అధికార ప్రతినిధి కప్పల వెలుగు కుమారి మండిపడ్డారు. వైకాపా మహిళలు ఇటీవల నిర్వహించిన ఒక మీడియా సమావేశంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శ్రీనివాస్‌పై చేసిన వ్యాఖ్యలను మంగళవారం మీడియా సమావేశంలో వారు తీవ్రంగా ఖండించారు. 2019 ఎన్నికల్లో ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించిన నగర ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, ఆమెను ఓడించేందుకు ప్రయత్నిం చిన వైకాపా వారికి మధ్యలో ఎందుకు అంత ఉలిక్కిపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. అసెంబ్లీలో ఎమ్మెల్యే భవానీ లేవనెత్తిన ప్రశ్నకు సోషల్ మీడియాలో అసభ్యంగా పోస్టింగ్‌లు పెట్టిన సమయంలోను, సోషల్ మీడియాలో పెట్టిన పోస్టింగ్‌ల విషయమై చర్యలు తీసుకోవాలని దిశ పోలీసు స్టేషన్‌లో కేసు పెడితే అప్పుడు ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. మీడియా సమావేశంలో రాజమండ్రి పార్లమెంట్ మహిళ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి మీసాల నాగమణి, నగర మహిళ కమిటీ ప్రధాన కార్యదర్శి కానేటి కృపామణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విజయవంతంగా జగనన్న సురక్ష

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర-ఏలూరు: అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలు అందకుండా ఉండకూడదన్న మహెూన్నత లక్ష్యంతో జూలై 1 న నుంచి నిర్వహించిన 'జగనన్న సురక్షా' కార్యక్రమానికి మంచి స్పందన లభించిందని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు.వివిధ పాఠశాలు, కాలేజీల ప్రారంభం, అడ్మిషన్ల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యార్థులు ఎవరూ ఇబ్బందులు పడకూడదని సురక్షా శిబిరాల్లోనే వివిధ ధృవీకరణ పత్రాలను కూడా మంజూరు చేయడం జరిగిందన్నారు. వివిధ శాఖలు జారీ చేసే 11 రకాల ధృవీకరణ పత్రాలను ఎటువంటి యూజర్ ఛార్జీలు లేకుండా అక్కడికక్కడే ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమం ప్రారంభమైన మొదటి రోజు నుంచే ప్రజల దగ్గర నుంచి విశేషమైన స్పందన లభించిందన్నారు.ఏలూరు జిల్లాలోనీ 605 సచివాలయములందు 10671 మంది వాలంటీర్లు జగనన్న సురక్ష కార్యక్రమములో పాల్గొని 6,92,365 కుటుంబములకు 6,18,317 కుటుంబములని సందర్శించి, ప్రతి ఒక్కరి ఇంటికి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న 11 రకాల సర్వీసులను వారికి వివరించి, వారి నుండి 4,10,287 అర్జీలను స్వీకరించి, 3,89,387 సర్విస్ సేవలు నేటివరకు అందజేసినట్టు తెలిపారు.

దొంగల్ని పట్టించిన ఫోన్

ఇరువురి అరెస్టు

- ఐదు లక్షల విలువ చేసే సొత్తు రికవరీ

విశాలాంధ్ర - రాజానగరం : గత నెలలో తాళం వేసి ఉన్న ఇంటికి కన్నం వేసిన ఇద్దరు వ్యక్తుల్ని వారు దొంగిలించిన ఫోనే పట్టించింది. రాజానగరం పోలీసు స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామంలో తాళాలు వేసి ఉన్న ఇంటిలో దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులను రాజానగరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు.ఇందుకు సంబంధించి రాజానగరం పోలీస్ స్టేషన్లో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశం లో సిఐ పి.కాశీ విశ్వనాథం మాట్లాడుతూ కోంతమూరు గ్రామానికి చెందిన అత్తిలి సత్యనారాయణ తన ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి గత నెల 20వ తేదీన కర్ణాటక కు వెళ్లాడన్నారు.తిరిగి 24వ తేదీన ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి ప్రధాన గుమ్మానికి,గ్రిల్ కి వేసిన తాళాలు పగలగుట్టి ఉన్నట్లు గమనించారన్నారు. దీంతో లోపలికి వెళ్లి చూడగా లోపల బీరువా తలపులు తీసి ఉన్నాయన్నారు.బీరువా లాకర్లో ఉన్న 134 గ్రాముల బంగారం వస్తువులు,1476 గ్రాముల వెండి వస్తువులు, ఒక సెల్ ఫోన్ దొంగతనానికి గురైనట్లు గుర్తించారన్నారు. దీంతో బాధితులు రాజానగరం స్టేషన్లో గత నెల 24న ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టినట్లు చెప్పారు. బాధితుడి ఇంట్లో చోరీకి గురైన ఫోన్లో నిందితుల్లో ఒకరు తన సిమ్ వేసి వాడినట్లు గుర్తించారు. దీంతో అనుమానం ఉన్న ఇద్దరు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకొని విచారించడంతో అసలు నిజాలు బయటకు వచ్చాయన్నారు. దొంగతనానికి గురైన బంగారం, వెండి వస్తువులు, సెల్ ఫోన్ మొత్తం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.వీటి విలువ రూ.5,10,320 ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ వై.సుధాకర్,స్టేషన్ సిబ్బంది, పాల్గొన్నారు.

ట్రాన్స్ జెండర్ల హక్కుల న్యాయ విజ్ఞాన సదస్సు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. ప్రత్యూష కుమారి క్వారీ మార్కెట్ సమీపంలో సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి ప్రత్యూష కుమారి మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లకు భారత రాజ్యాంగం ద్వారా గౌరవ సుప్రీం కోర్టు వారి ఆదేశాల ద్వారా వారికి అందించబడిన హక్కుల గురించి వివరించారు. వారి పట్ల ఎవ్వరూ వివక్ష చూపరాదన్నారు. స్త్రీ పురుషులకు సమంగా వారికి అన్ని హక్కులు ఉన్నాయని తెలిపారు. వారి హక్కులను వినియోగించుకుని అభివృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ డీ.ఎస్.పి. కె. తిరుమల రావు మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు స్త్రీ పురుషులతో సమానంగా అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించాలన్నారు. అనంతరం ట్రాన్స్ జెండర్ల కోసం ఏర్పాటు చేసిన ఉచిత హెల్ప్ లైన్ నంబర్ 1091 పోస్టర్ ను ఆవిష్కరించారు. ట్రాన్స్ జెండర్లు ఈ హెల్ప్ లైన్ సేవలను వినియోగించుకోవాలని న్యాయమూర్తి అన్నారు.

అవయవదానంపై అవగాహన సదస్సులు

విశాలాంధ్ర - కరప : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆగస్టు మూడవ తేదీని అవయవ దాన దినోత్సవంగా జరుపుకోవాలని సర్క్యులర్ జారీ చేయడం జరిగిందని ఎంపీడీవో కే అప్పారావు తెలిపారు. ఆజాతిక అమృత మహెూత్సవంలో భాగంగా అవయవదానంపై ప్రజలలో అవేర్నెస్ కల్పించాలని, దీనిపై ఈ నెల మూడో తేదీన పంచాయతీ కార్యదర్శులతో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మండల గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరినట్టు ఎంపీడీవో తెలిపారు.

పశువుల దాణా పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ చిర్ల

విశాలాంధ్ర - రావులపాలెం : రావులపాలెం మండలం ఊబలంక గ్రామ శివారు తోకలంకలో గోదావరి వరదల వలన పశుగ్రాసం మునిగి నష్టపోయిన పాడిరైతులకు ప్రభుత్వం అందచేసిన 5 టన్నుల పశువుల దాణా(టిఎంఆర్)ను ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆలమూరు మండలం మూలస్థానం గ్రామంలో రైతులకు పంపిణీ చేశారు. అనంతరం చిర్ల మాట్లాడుతూ బడుగువానిలంక గ్రామ లంక పాడి రైతులకు కూడా 5 టన్నుల పశువుల దాణా రావడం జరిగింది అని దానిని కూడా రైతులకు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మూలస్థానం విచ్చేసిన చిర్ల గ్రామంలోని జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని డిజిటల్ క్లాస్ రూమ్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆలమూరు ఎంపిపీ తోరాటి లక్ష్మణరావు, చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీను, వైసీపీ నాయకులు, ఎంపీడీఓ జి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాడి వేడిగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి అధ్యక్షతన ఆద్యంతం రసాభాసగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు వారి వారి శాఖలలో నిర్వహిస్తున్న ప్రగతిని చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులకు, ఎంపీటీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా, ప్రోటోకాల్ పాటించకుండా అధికారులు అవమాన పరుస్తున్నారని కే సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు లు ముక్తకంఠంతో ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ప్రతి సమావేశంలోనూ ఇదే విషయమై పలుమార్లు అడిగినా అధికారులు లెక్కచేయడంలేదన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు కాకుండా, కింది స్థాయి అధికారులు హాజరు కావడంతో వారు సమస్యల పట్ల అవగాహన ఉండకపోవడంతో, పరిష్కారం చూపలేకపోతున్నారన్నారు. దీనిపై ఆర్ అండ్ బి ప్రతినిధి వివరణ ఇస్తూ ఏఈ మినిస్టర్ ప్రోగ్రాం లో ఉండడంతో హాజరుకాలేక పోయారన్నారు. చివటం ఎంపిటిసి వేముల వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఓ టి ఎస్ పథకంలో తాను గ్రామం నుండి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున 12 మందిచే కట్టించగా దానికి సంబంధించిన బాండ్లు ఇంతవరకు అందజేయలేదన్నారు.

మానవత సంస్థకు జనార్ధన్ లక్ష వితరణ

విశాలాంధ్ర - తాళ్లపూడి : తాళ్లపూడి మండలంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న సేవా కార్యక్రమాల నిమిత్తం మానవత సేవా సంస్థ గౌరవ చైర్మన్ సింహాద్రి జనార్ధన్ లక్ష రూపాయలను వితరణగా అందజేసారని సంస్థ తెలిపింది. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలిపారు.